ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 07-09-2025 సమయం 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జంట నగరాల తాగునీటి కోసం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లకు మల్లన్న సాగర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలించే ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు శంకుస్థాపన చేస్తారు.

2. రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి.. అధిక దిగుబడి సాధించే మెళకువలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

3. రాష్ట్రంలో గురుకుల విద్యాలయాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ్యుడు హరీశ్ రావు ఆరోపించారు.

4. రాష్ట్రంలో రేపటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు వివిధ జిల్లాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

రేవంత్ రెడ్డి – మూసీ నది

మూసీ పునరుజ్జీవన పథకంలో భాగంగా గోదావరి తాగునీటి సరఫరా పథకం రెండో దశ, మూడో దశ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు శంకుస్థాపన చేయనున్నారు. 7,360 కోట్ల రూపాయలతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో మల్లన్న సాగర్ నుంచి 20 TMCల నీటిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలకు తరలించి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీరుస్తారు. GHMC, ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలకు సంబంధించి దాదాపు 25 లక్షల మంది తాగు నీటి సౌకర్యాన్ని అందించే మరో ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. కోకాపేట లే అవుట్ అభివృద్ధి 298 కోట్ల రూపాయలతో చేపట్టే కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేపు శంకుస్థాపన చేస్తారు.

DESK

తుమ్మల నాగేశ్వరరావు

రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి.. అధిక దిగుబడి సాధించే మెళకువలపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సూచించారు. అధిక ఎరువులు, పురుగుల మందులు నిర్వహించడం వల్ల భూసారంపై ప్రభావం చూపి.. పంట దిగుబడులు తగ్గుతాయన్నారు. ఈ రోజు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలోని పామాయిల్ శాఖను ఆయన సందర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో దేశానికే తెలంగాణ కేంద్రంగా నిలిచిందని అన్నారు. సిద్ధిపేటలో త్వరలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం అవుతుందని ఆయన వెల్లడించారు. అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో విద్యార్థులతో తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

PTC భద్రాద్రి కొత్తగూడెం

సీఎం రేవంత్ - నిమజ్జనం

రాష్ట్రవ్యాప్తంగా వినాయక నవరాత్రుల ఉత్సవాలు, నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగియడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఈ ఉత్సవాలను జయప్రదంగా నిర్వహించిన పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్తు, రవాణా, పంచాయతీరాజ్, వైద్య,ఆరోగ్యశాఖ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

వినాయక నవరాత్రుల్లో 3 వ రోజు నుంచి 11వ రోజు వరకు మొత్తం లక్షా 40 వేల విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

DESK

నాగార్జునసాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పది క్రస్ట్ గేట్లను ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్ ఫ్లో 1,33,824 క్యూ సెక్కులు ఉండగా, అంతే పరిమాణంలో అవుట్ ఫ్లో గా వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 589.7 అడుగులకు చేరింది.

DESK

హరీశ్ రావు

రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు, కళాశాలలు దుస్థితి చేరుకున్నాయని, వాటిలో చదివే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. జ్వరాలు, పాముకాట్లు, ఫుడ్ పాయిజన్ వంటి సంఘటనలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గురుకుల విద్యా సంస్థలను దేశానికే ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దామని ఇప్పుడు ఆ పరిస్థితికి పూర్తిగా భిన్నంగా ఉందని హరీశ్ రావు విమర్శించారు.

DESK

ఇందిరమ్మ ఇళ్లు

మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు అన్ని విధాలా మేలు చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. ఈరోజు వేముల వాడ అర్బన్ మండలం అగ్రహారంలో 1550 మంది ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో పాటు పంపిణీ చేశారు. 240 కోట్ల రూపాయలతో ముంపు గ్రామాల ప్రజలకు 4 వేల 696 ఇళ్ల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు.

BYTE: ఆది శ్రీనివాస్

పీటీసీ, రాజన్న సిరిసిల్ల

రాజగోపాల్ రెడ్డి

తనకు పదవి కన్నా రైతుల ప్రయోజనాలే ముఖ్యమని.. వారి శ్రేయస్సు కోసం ప్రభుత్వంతో పోరాడటానికి సిద్ధంగా ఉన్నానని మునుగోడు కాంగ్రెస్ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాను అధికార పార్టీ ఎమ్మెల్యేనైనా తన నియోజకవర్గానికి నిధుల విషయంలో అన్యాయం చేస్తే.. సహించేది లేదని స్పష్టం

చేశారు. రీజనల్ రింగు రోడ్డు భూ నిర్వాసితుల ప్రయోజనాల కోసం తాను ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆయన అన్నారు.

DESK

వాతావరణం

రాష్ట్రంలో రేపటి నుంచి ఈ నెల 14వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్ , నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలతో పాటు భువనగిరి , సూర్యాపేట జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

DESK

UPI

ఈ నెల 15 నుంచి యూపీఐ ద్వారా కొన్ని ప్రత్యేకమైన చెల్లింపుల పరిమితిని రోజుకు 10 లక్షల రూపాయలకు పెంచుతూ NPCI వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు లక్ష రూపాయలు మాత్రమే యూపీఐ ద్వారా పంపే వీలు ఉండగా.. ఇన్సూరెన్స్, పన్నులు, స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు ఈ పరిమితి అవరోధంగా మారడంతో..

ఒక్కసారి ఐదు లక్షలు రూపాయలు, మొత్తంగా రోజుకు 10 లక్షల రూపాయల వెసులుబాటును కల్పించింది. కాగా, వ్యక్తుల మధ్య పంపే లావాదేవీల పరిమితి మాత్రం లక్ష రూపాయలు గానే ఉంచింది.

DESK

సంపూర్ణ చంద్రగ్రహణం

ఈరోజు రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా రాష్ట్రంలో భద్రాచలం, యాదగిరి గుట్ట, వేములవాడ, అలంపూర్, కొండగట్టు, బాసర, వరంగల్ భద్రకాళి, కాళేశ్వరం, ధర్మపురి దేవాలయాలతో పాటు అన్ని ఆలయాలను ఈ మధ్యాహ్నం నుంచి మూసివేశారు. రేపు తెల్లవారుజామున సంప్రోక్షణ, గ్రహణ శాంతి ప్రక్రియల అనంతరం ఆలయాలను తెరిచి.. భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

DESK